లోపభూయిష్టంగా స్ట్రామ్‌వాటర్ డ్రైన్ నిర్మాణం

- విద్యుత్ స్తంభాలను మార్చకుండా నిర్మాణం జరుగుతున్న తీరు
- కౌన్సిల్ తీర్మానానికి విరుద్ధంగా డ్రైన్ నిర్మాణం
- వర్షం వస్తే మళ్లీ ముంపు బారిన పడతామంటున్న స్థానికులు


దర్శిపేట కృష్ణవేణి రోడ్డులో స్తంభాల వద్ద గ్యాప్‌లతో అసంపూర్తిగా నిర్మిస్తున్న స్ట్రామ్‌వాటర్ డ్రైన్ నిర్మాణం

పటమట(విజయవాడతూర్పు): ఉన్న నాలుకకు మందేస్తే కొండనాలుక ఊడిన చందాన ఉంది పటమటలో జరుగుతున్న స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ నిర్మాణం. వరద నీటి మళ్లింపునకు సరైన ప్రణాళిక లేకపోవటంతో కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ డ్రైనేజీ నీళ్లతో మునిగిపోతున్నాయి. అవుట్‌ఫాల్ డ్రైన్లతోపాటు ప్రధాన డ్రైన్లు కూడా వాగులను తలపించేలా మారటానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. పర్సంటేజీల కోసం శరవేగంగా నిర్మాణం చేపడుతున్నట్లు ప్రకటనలిస్తున్నప్పటికీ.. ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నప్పటికీ అసలు సమస్యను గాలికి వదిలేసి కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని పటమట వాసులు వాపోతున్నారు. వర్షం వస్తే వరద నీటిని మళ్లింపునకు అమృత్ 2.0లో చేపట్టిన స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా సాగుతున్నాయి. విజయవాడ నగరం ముంపునకు గురవటానికి ప్రధాన కారణమైన స్ట్రామ్‌వాటర్ డ్రైన్ నిర్మాణం లెవలింగ్ లేకపోవటం, స్తంభాలను తొలగించకుండా అక్కడ గ్యాప్‌లు వదలటంతో నీరంతా రోడ్డు పైకి వచ్చి, ప్రజల రాకపోకలకు అవరోధం ఏర్పడుతోంది. పటమట కృష్ణవేణి స్కూల్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం కూడా మళ్లీ అదే తప్పుడు పద్ధతిలో జరుగుతోంది.

బెంజిసర్కిల్ నుంచి వచ్చే వరద నీరంతా ఇటువైపే...

కలకత్తా–చెన్నై జాతీయ రహదారి 16 వెంబడి ఉన్న బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ జంక్షన్ సర్వీస్‌రోడ్డులో ఉన్న అవుట్‌ఫాల్ డ్రైనేజీ నీరంతా వెళ్లేందుకు మార్గం లేకపోవటంతో పాటు, కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ మురుగునీళ్లతో నిండి ఉండేవి. పూణే –మచిలీపట్నం జాతీయ రహదారి –216 వెంబడి బెంజిసర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు వరద, మురుగు నీరంతా రోడ్లతో నిండిపోయేవి. మరోవైపు కొండప్రాంతాలైన మొగల్రాజపురం, గాయత్రినగర్, కళానగర్ వైపు నుంచి వచ్చే మురుగునీటికి తోడు స్టెల్లా కళాశాల వైపు ఉన్న చిన్నచిన్న డ్రైన్లన్నీ స్టెల్లా కళాశాల, నిర్మలా కాన్వెంట్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి దర్శిపేట మీదుగా బందరు కాల్వలో కలిసే మ్యాపింగ్ ఉంది. అయితే డ్రైన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవటం, తరచూ సిల్టు తొలగించకపోవటం, ఫ్లెఓవర్ నుంచి వచ్చే నీరంతా సరైన రీతిలో వరదనీటి మళ్లింపు లేకపోవటంతో ఆయా ప్రాంతాలన్నీ జలమయమయ్యేవి. రోజుల తరబడి రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో మోటర్లు, జెట్టింగ్/సూపర్‌సక్కింగ్ మిషన్లతో నీటిని తోడేవారు. దీనివలన వాణిజ్యప్రాంతాలైన ఈ ఏరియాలో వ్యాపారాలు రోజులతరబడి మూతపడిపోయేవి. స్థానిక వ్యాపారస్తులు, నివాసితులు పదేపదే వీఎంసీకి విజ్ఞప్తులు చేయటంతో ఎట్టకేలకు నిధుల కేటాయింపు జరిగింది.

మళ్లీ ముంపుకేనా...

ఎన్టీఆర్ సర్కిల్ నుంచి దర్శిపేటలో కృష్ణవేణి రోడ్డులో 400 మీటర్ల మేర పొడవు, మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో అమృత్ 2.0లో భాగంగా రూ.49 లక్షలతో పూర్తి కాంక్రీట్‌తో నిర్మిస్తున్న ఈ డ్రైన్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. గతంలో విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ/ప్రైవేటు నెట్‌వర్క్ స్తంభాలను తొలగించిన తర్వాతే స్ట్రామ్ వాటర్ నిర్మాణాలు జరగాలని వీఎంసీ కౌన్సిల్ 2024 జరిగిన బడ్జెట్ కౌన్సిల్లో తీర్మానం చేసింది. దీనికి విరుద్ధంగా ఇప్పుడు నిర్మాణం జరుగుతోంది. కౌన్సిల్ తీర్మానంకు విరుద్ధంగా స్తంభాలను తొలగించకుండా నిర్మాణం చేపడితే వర్షం వస్తే మళ్లీ ముంపుబారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు

అధికారులకు వీఎంసీ కమిషనర్ ఆదేశం



పటమట(విజయవాడతూర్పు): నగరంలో రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం వన్‌టౌన్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్, అవుట్‌ఫాల్ డ్రైన్స్‌తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రైన్లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేయాలని, వర్షపు నీరు రోడ్డుపైన నిలవకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సత్కారం




పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు అధికారులు, సిబ్బందిని సోమవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఘనంగా సన్మానించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో గంటా మేరీ ప్రశాంతి (సూపరింటెండెంట్ – ఎస్టేట్ విభాగం), రెబగొండ్ల ఓబేశ్వరరావు (శానిటరీ సూపర్వైజర్ – ప్రజారోగ్యం విభాగం), పీవీఎస్‌పీఆర్ శర్మ (జేటీఓ – ఇంజినీరింగ్ విభాగం), ఎ.ధనలక్ష్మి (ఆఫీస్ సబార్డినేట్ – అకౌంట్స్ విభాగం), జేవీ శ్రీనివాస్ (ఎస్టేట్ విభాగం)లను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివని విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు అన్నారు. హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ ఇళయరాజా భారతీయ భాషల్లో వచ్చిన అనేక చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు. సీనియర్ గాయని చందన మాట్లాడుతూ ఇళయరాజా స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, మారేపల్లి జోషి పాల్గొన్నారు. చందన ఆధ్వర్యంలో చరణ్, అనిల్, సింధూ, రమ్య, భాస్కర్ ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన చిత్ర గీతాలను ఆలపించారు.

జేఈఈ-2025 అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


పి.హేమ సాయి సూర్య కార్తీక్ (26వ ర్యాంకు)


కె.రసజ్ఞ (78వ ర్యాంకు)

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ–2025 అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తమ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ విభాగంలోని చైతన్య విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులు పి.హేమసాయి సూర్య కార్తీక్ ఓపెన్ కేటగిరీలో 26వ ర్యాంకు, కె.రసజ్ఞ 78వ ర్యాంకు పొందారని వివరించారు. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 500 లోపు ర్యాంకులను 23 మంది, వెయ్యి లోపు ర్యాంకులను 44 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఈ ఫలితాల్లో ముఖ్య పాత్ర పోషించిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులను, చైతన్య విద్యాసంస్థ డీన్‌లు, ప్రిన్సిపాల్‌ను మురళీకృష్ణ అభినందించారు.

రాష్ట్ర ఖ్యాతిని చాటే క్రీడాకారులకు సహకారం అందిస్తాం


మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులను అభినందిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చే క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పూర్తి సహకారం అందించి ప్రోత్సహిస్తుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హామీ ఇచ్చారు. బీహార్‌లో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన సెపక్ తక్రా రాష్ట్ర జట్టు, మహారాష్ట్రలోని పూణేలో మే 16 నుంచి 22వ తేదీ వరకు జరిగిన 3వ కుడో(మార్షల్ ఆర్ట్స్) జాతీయ చాంపియన్‌షిప్ కప్ పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు సోమవారం శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు 5 గోల్డ్, ఒక సిల్వర్, 5 బ్రాంజ్ మెడల్స్ సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటడం అభినందనీయమని చైర్మన్ అన్నారు. ఇదే క్రీడాస్ఫూర్తితో అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించి పతకాలు సాధించాలని సూచించారు.

ప్రతి సమస్య పరిష్కారం కావాలి


ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కారం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సర్కిల్–1 కార్యాలయంతో పాటు వీఎంసీ ప్రధాన కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత వారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నివేదికలో అధికారులు పరిష్కరించిన దరఖాస్తులను వీక్షించారు. ప్రతి సమస్యకి సరైన పరిష్కారం అందించాలని, ప్రజలకు సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం సమస్యలను తెలియపరిచే పురం, ఇతర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని, ఇప్పటివరకు పురమిత్రలో నమోదైన సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. చిట్టినగర్ సర్కిల్–1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆరు ఫిర్యాదులు రాగా ప్రధానంగా ఇంజినీరింగ్ సంబంధిత సమస్యలు, ఇల్లు కేటాయింపు ఫిర్యాదులను స్వీకరించారు.

ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించినవి 3, ఇంజినీరింగ్ 3 , రెవెన్యూ సంబంధించినవి 2, వైద్య – ఆరోగ్యంపై 2 ఉన్నాయి. సర్కిల్ 1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘వెన్నుపోటు దినం’ను జయప్రదం చేయండి


20వ డివిజన్‌లో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణలంక మండల పార్టీ అధ్యక్షుడు పంతాల సాయి, కార్పొరేటర్ కొండారెడ్డి


17వ డివిజన్‌లో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రామిరెడ్డి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఈనెల 4వ తేదీన వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ కృష్ణలంక మండల అధ్యక్షుడు పంతాల సాయి పిలుపునిచ్చారు. కృష్ణలంక నల్లగేటు డౌన్‌లోని 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వెన్నుపోటు దినోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆయన 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుంచి ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఎండగడుతూ వెన్నుపోటుకు గురైన ప్రజానీకానికి అండగా నిలబడి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇది నిరసన కార్యక్రమం కాదని, ఇచ్చిన హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రజల గళం అని అన్నారు. కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సూపర్ సిక్స్‌తో పాటు మరో 143 హామీలు ఇచ్చి ఒక్క దానిని కూడా అమలు చేయలేదన్నారు. 4న వెన్నుపోటు దినం కార్యక్రమంలో కృష్ణలంక మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 20వ డివిజన్ అధ్యక్షుడు షేక్ సుభానీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పటమటలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

17వ డివిజన్‌లో...

రాణిగారితోట, 17వ డివిజన్‌లోని డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సర కాలంలో చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై ఈ నెల 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

12వ డివిజన్‌లో...

పటమట(విజయవాడతూర్పు): 12వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మాగంటి నవీన్, రిజ్వాన్ వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆటోనగర్, రామలింగేశ్వర నగర్, గుణదల, మొగల్రాజపురంలలో కూడా స్థానిక నాయకులు వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 4న దర్శిపేట ఎస్ఎస్ఎం స్కూల్ వద్ద ఉన్న నల్లూరి వారి కల్యాణ మండపం నుంచి ర్యాలీ ప్రారంభమై పటమట సెంటర్‌లో ఉన్న తూర్పు నియోజకవర్గ రెవెన్యూ కార్యాలయం వరకు సాగుతుందని, అక్కడ తహసీల్దార్‌కు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ వినతి పత్రం సమర్పిస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు


వృథాగా పోతున్న నీటికి చెక్క అడ్డం పెట్టిన దృశ్యం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ సిటీ టెర్మినల్ బస్టాప్ ఆవరణ దుర్గంధం వెదజల్లుతోంది. ఆరు బయట ఎలుకలు మృతి చెంది దర్శనమిస్తున్నాయి. ఇక్కడ పైపులు సక్రమంగా లేకపోవడంతో వాడుకునే నీరు సైతం వృథాగా పోతోంది. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. విద్యుత్ బాక్సులు వేలాడుతున్నాయి. వాడేసిన కొబ్బరిబొండాలు గుట్టలుగుట్టలుగా ఆ పక్కనే పడి ఉంటున్నాయి. అయినప్పటికీ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కాని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇక్కడి నుంచి వందలాది మంది ప్రయాణికులు వేరే ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఈ బస్‌స్టాప్‌లో సుదూర సర్వీస్‌లతో పాటు సిటీసర్వీస్‌లు కూడా ఆగుతుంటాయి. సౌకర్యాలు లేక ప్రయాణికులు అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌స్టాప్‌లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటిపై చర్యలు తీసుకోవాలి

కమ్యూనిస్టు పార్టీల డిమాండ్




మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్, కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేశాయి. సోమవారం గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ శాతవాహన కళాశాలకు సంబంధించిన కేసు కోర్టు పరిధిలో వివాదం నడుస్తోందన్నారు. ఈ సమయంలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సభ్య సమాజం తలదించుకునే చర్యకు పాల్పడ్డారన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. వందల కోట్ల విలువ చేసే శాతవాహన కళాశాల సొసైటీ భూమిని కబ్జా చేసేందుకు స్వయంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజా రంగంలోకి దిగి తన అనుచరుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కిడ్నాప్ చేయించారని మండిపడ్డారు. కళాశాల వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ప్రిన్సిపాల్ కిడ్నాప్ కోర్టుధిక్కరణ కిందకు వస్తుందన్నారు.

''మేం అధికారంలో ఉన్నాం.. మేం ఏది చెప్తే అది నీవు చేయాలి.. మేమనుకున్నది జరగాలి, తమకు అనుకూలంగా కళాశాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయాలి, లేకపోతే చంపుతాం' అనే దోరణిలో ఆలపాటి చేసిన వ్యాఖ్యలను బాధిత ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మీడియా సాక్షిగా వెల్లడిచేశారంటే.. ప్రభుత్వాన్ని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని, ఎమ్మెల్సీ ఏ స్థాయిలో బరితెగించారో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ నాయకులు భూపతి రమణారావు, పి. కృష్ణ, లంకా దుర్గారావు, ఎస్ వీరభద్రరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణం చేస్తుండగానే ఆక్రమణలు


పోరంకిలో డ్రెయినేజీని ఆక్రమించి చేసిన నిర్మాణం

పెనమలూరు: రోడ్డు పక్కన ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా ఉంది. పోరంకి- నిడమానూరు రోడ్డులో డ్రెయినేజీ పనులు జరుగుతుండగానే ఆక్రమణ దారులు ఏకంగా డ్రెయినేజీని ఆక్రమించే పనిలో ఉన్నారు. అధికార పార్టీ నేతల అండదండలతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు ఇరు పక్కల ఆక్రమణల కారణంగా డ్రెయినేజీ పూర్తిగా కనపడకుండా పోయింది. ఈ కారణంగా చినుకు పడితే రోడ్డుపై రెండు అడుగుల మేర మురుగు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీనివలన సామాన్య ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా నిడమానూరు రోడ్డులో డ్రెయినేజీ పనులు జరుగుతుంటే టీడీపీ నేతల అండదండలతో ఓ వ్యాపారి డ్రెయినేజీని పూడ్చి కొబ్బరి బోండాల షాపు పెట్టడానికి రంగంలోకి దిగాడు. మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు నిరోధించటానికి చర్యలు తీసుకున్నారు. అయితే తమకు టీడీపీ నేతల అండదండలు ఉన్నాయని వ్యాపారి మున్సిపాలిటీ సిబ్బందిని బెదిరించే యత్నం చేశాడు. ఆక్రమణలు సిబ్బంది ఆపినా పూర్తిగా తొలగించలేదు. ఆక్రమణలు నిరోధించక పోతే గతంలో వలె డ్రెయినేజీ పూర్తిగా ఆక్రమణలకు గురై మురుగునీరు రోడ్డుపై నిలిచిపోతుందని గ్రామస్తులు అంటున్నారు.


బంతి తగిలి మహిళ కంటికి గాయం

పెనమలూరు: బాలుడు విసిరిన బంతి మహిళకు తగిలి కంటికి తీవ్ర గాయమవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరు గ్రామానికి చెందిన కె.సత్యవతి ఇంట్లో పనులు చేసుకుంటుండగా పక్క ఇంట్లో ఉంటున్న బాలుడు బంతి విసిరటంతో అది వచ్చి సత్యవతి కంటికి తగిలింది. కంటిని పరీక్షించిన వైద్యులు కంటికి ఆపరేషన్ చేయాలని తెలిపారు. బాధితురాలి కుమార్తె ధనలక్ష్మి బాలుడి తల్లితండ్రులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. తమకు న్యాయం చేయాలని బాధితురాలి కుమార్తె ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రారంభమైన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు స్వామి వారికి తిరుమంజన శత అష్టోత్తరంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. అనంతరం సుదర్శన కళాభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు స్వామివారి విశేషంగా పుష్పాలు, తులసీదళాలతో అర్చన నిర్వహించారు. అలాగే లోక కళ్యాణార్థం లక్ష్మిగణపతి హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న నిరుపేద బాలుడికి వాసవి క్లబ్ అజిత్‌సింగ్‌నగర్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన కట్టమూరి నాగచైతన్య(14) ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాలుడి కుటుంబ సభ్యుల దీనావస్థను గుర్తించిన వాసవి క్లబ్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు కేవీ భాస్కరరావు, జెడ్‌సీ సురేష్, సభ్యులు సోమవారం బాలుడికి నగదును అందించారు.

వాణిజ్య లైంగిక బాధిత మహిళల హక్కులు కాపాడండి


సమావేశంలో మాట్లాడుతున్న విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వేశ్యావృత్తిలో మగ్గుతున్న సుమారు లక్ష 33వేల మంది వాణిజ్య లైంగిక బాధితుల(సెక్స్ వర్కర్స్), మానవ అక్రమ రవాణా బాధిత మహిళల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని రాష్ట్ర అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమాలతో పాటు చట్ట ప్రకారం అందాల్సిన నష్ట పరిహారాలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అంతర్జాతీయ వాణిజ్య లైంగిక బాధితుల (సెక్స్ వర్కర్స్) హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాణిగారితోటలోని కమ్యూనిటీ భవన్‌లో రాష్ట్ర స్థాయి అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 2021–22 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో అత్యధికంగా వేశ్యావృత్తిలోని మహిళల సంఖ్య రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని, దాదాపు 2.25 లక్షల మంది కుటుంబ సభ్యులు ఈ మహిళలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరేకాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే సెక్స్ వర్కర్స్‌ను కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. వీరంతా ప్రభుత్వ సంరక్షణ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ షెల్టర్ హోమ్ ఆధారిత పునరావాసం రద్దు చేసి కమ్యూనిటీ ఆధారిత పునరావాస విధానాన్ని అమలు చేయాలని, అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్స్‌తో కూడిన స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని, ప్రత్యేక కేటగిరీలో ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్, ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 5వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రస్ మేకింగ్, జ్యూట్ క్రాఫ్ట్స్, ప్రొడక్ట్ మేకర్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషీన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజిరేషన్, హోమ్ క్రాఫ్ట్స్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ ప్రాసెసింగ్ అసిస్టెంట్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, అసిస్టెంట్ డ్రస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ అసిస్టెంట్, ఫ్యాషన్ జ్యూవెలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 నంబరులో కాని సంప్రదించాల్సిందిగా కోరారు.